టమాట రైతు 'ధర'హాసం

- 15 కిలోల బాక్సు ధర రూ.800
- బయట రాష్ట్రాల్లో తగ్గిన సరుకు
- మార్కెట్లో అమాంతం పెరిగిన ధర

ధర్మవరం రూరల్: ధరలున్నప్పుడు రైతుల వద్ద సరుకు ఉండదు. సరుకున్నప్పుడు ధరలు ఉండవు. ఇది కొన్నేళ్లుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రైతుల పరిస్థితి. ఇటీవల 15 కిలోల టమాట బాక్సు ధర మార్కెట్‌లో రూ.800 వరకు ధర పలికింది. గత 20 రోజులుగా అనంతపురం మార్కెట్‌లో టమాటకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఈ మార్కెట్‌కు ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు అధిక సంఖ్యలో వచ్చి టమాట కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. వర్షాలకు వైరస్ తెగుళ్ల కారణంగా టమాట దిగుబడి పెద్దగా లేకపోవడంతో ఉన్న సరుకుకే ధరలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. మరో నెల రోజులపాటు మంచి ధరలు ఉంటాయని రైతులు భావిస్తున్నారు.



బడన్నపల్లి సమీపంలో పూత దశలో ఉన్న టమాట తోట

విడతల వారీగా సాగు

ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లో చాలా మంది రైతులు విడతల వారీగా టమాట సాగు చేశారు. సుమారు 2 వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో మొదటి దశలో పంట పెట్టారు. ప్రస్తుతం ఆ పంట దిగుబడి దాదాపు పూర్తి కావస్తోంది. మరో అదునులో సాగు చేసిన పంటపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకుంటున్నారు. టమాటకు మంచి ధరలు ఉండడంతో చాలామంది రైతులు నారు కోసం నర్సరీల్లో ఆర్డర్లు పెట్టుకుంటున్నారు.

టమాట ధరలకు రెక్కలు

ధర్మవరం డివిజన్‌లో పండించిన పంటను అనంతపురం, మదనపల్లి మార్కెట్లకు తరలిస్తుంటారు. రెండు రోజుల క్రితం మదనపల్లి మార్కెట్‌లో మొదటి రకం టమాట 30 కేజీల బాక్సు ధర రూ.1,600 పలికింది. రెండో రకం రూ.1,300 నుంచి రూ.1,200 వరకు పలికినట్లు రైతులు పేర్కొంటున్నారు. అనంతపురం కక్కలపల్లి మార్కెట్‌లో 15 కేజీల బాక్సు రూ.700 దాకా ధరలు పలికాయి. అదే విధంగా చిన్న కాయలు రూ.300 నుంచి రూ.350 వరకు ధరలు పలికాయని రైతులు చెపుతున్నారు. అనంతపురంలో 32 టమాట మండీలు ఉన్నాయి. అయితే ఆశించిన మేర మండీలకు టమాటాలు రాకపోవడంతో వచ్చిన వాటికి వ్యాపారులు అధిక ధరలను వెచ్చించి కొనుగోలు చేస్తున్నారని రైతులు చెపుతున్నారు. ప్రస్తుతం టమాట పండించిన రైతులకు కాసుల వర్షం కురుస్తుందని రైతులు అంటున్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ



మూడో స్థానంలో నిలిచిన జట్టు

కదిరి అర్బన్: రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో శ్రీసత్యసాయి జిల్లా జట్టు ప్రతిభ కనబర్చింది. ఇటీవల నంద్యాల జిల్లా చాగలమర్రిలో జరిగిన 53వ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో శ్రీసత్యసాయి జిల్లా జట్టు ప్రతిభ కనబర్చి మూడవ స్థానం కైవసం చేసుకుంది. ఈసందర్భంగా జట్టును శ్రీసత్యసాయి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మహేష్ అభినందనలు తెలియజేశారు.

20న కంటి ఆపరేషన్ల శిబిరం



కరపత్రాలు విడుదల చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 20న ఉచిత కంటి ఆపరేషన్ల శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి తెలిపారు. స్థానిక సాంస్కృతిక మండలిలో గురువారం రోటరీ క్లబ్ సభ్యులు కంటి వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులతో కంటి పరీక్షలు చేయించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు. రోటరీక్లబ్ సభ్యులు శ్రీనివాస రెడ్డి, శివయ్య, సత్రశాల ప్రసన్నకుమార్, రత్నశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు కల్పించండి

ముదిగుబ్బ: మండలంలోని కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీఓ కార్యాలయం వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతు ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో కొత్తవారిని నియమించి గ్రామాల్లోని కూలీలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. అనంతరం అధికారులకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

నూతన కమిటీ ఎన్నిక



చిన్నపత్రికల అసోసియేషన్ శ్రీసత్యసాయి జిల్లా నూతన కమిటీ సభ్యులు

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం శ్రీసత్యసాయి జిల్లా చిన్న పత్రికల ఎడిటర్స్, రిపోర్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా వెంకటరమణ ఉపాధ్యక్షుడిగా గంగరాజు, ప్రధాన కార్యదర్శిగా శివప్ప,కార్యదర్శిగా చక్రపాణి, సంయుక్త కార్యదర్శులుగా రామచంద్ర, బాబాఫక్రోద్దీన్, కోశాధికారిగా తాజుద్దీన్, గౌరవ సలహాదారులుగా జయరామిరెడ్డి, ప్రభాకర్, నారాయణ, మహబూబ్‌బాషా, కార్యవర్గ సభ్యులుగా నరసింహులు, గోవిందులను ఎన్నుకున్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీలో 'పచ్చపాతం'

- మండల మీట్‌లో ఎంపీపీ సునితాబాయి

నల్లమాడ: మండలంలో సబ్సిడీ ప్రత్యామ్నాయ పంట విత్తనాలు (ఉలవలు) పంపిణీలో అధికారులు 'పచ్చపాత' వైఖరితో వ్యవహరించారని ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి ధ్వజమెత్తారు. మండల పరిషత్ సమావేశ భవనంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన వారికి పట్టాదారు పాసుపుస్తకాలు లేకపోయినా అధికారులు సబ్సిడీ ఉలవలు పంపిణీ చేశారని, ఇతరులకు పాసు పుస్తకాలు ఉన్నా స్టాకు లేదంటూ మొండి చేయి చూపారని ఆరోపించారు. గ్రామాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించడం లేదని, ఇది మంచి పద్ధతి కాదని ఎంపీపీ హితవు పలికారు. మండలంలో ఈ పంట నమోదు 95 శాతం పూర్తయినట్లు ఏఓ సుమతి తెలిపారు. తమ కాలనీలో ఆరు నెలలుగా తీవ్ర తాగునీటి సమస్య నెలకొందని బాపనకుంట ఎస్సీ కాలనీకి చెందిన నాగమ్మ సమావేశ మందిరంలోకి వచ్చి సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎంఈఓ సురేష్‌బాబు, పశువైద్యాధికారి రవీనాయక్, విద్యుత్ ఏఈ విశ్వనాథ్, ఐసీడీయస్ సూపర్‌వైజర్ సత్యవతి మాట్లాడుతూ తమ శాఖల పరిధిలో అమలవుతున్న కార్యక్రమాలను తెలియపర్చారు. జెడ్పీటీసీ ఎస్. రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ కే. సూర్యనారాయణ, ఈఓఆర్‌డీ అమర్నాథరెడ్డి, సూపరింటెండెంట్ మల్లికార్జునరెడ్డి, సర్పంచ్‌లు కుళ్లాయప్ప, బొజ్జేనాయక్, ప్రసాద్, ఎంపీటీసీ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ సురేష్‌బాబు

వ్యవసాయ కార్మికులు, రైతులను ఆదుకోవాలి

బత్తలపల్లి: జిల్లాలోని వ్యవసాయ కార్మికులు, రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, ఏపీ చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి డిమాండ్ చేశారు. గురువారం బత్తలపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం సమావేశాన్ని జిల్లా సహాయ కార్యదర్శి కుళ్లాయప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పనులు లేక వ్యవసాయ కూలీలు వలస వెళ్తున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి ఉపాధి హామీ పథకానికి క్రమంగా నిధులు తగ్గిస్తోందన్నారు. ఈనేపథ్యంలో ఉపాధి హామీ కింద అరకొరగా చేపడుతున్నారన్నారు. ఈ ఏడాది తీవ్రమైన అనావృష్టితో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మి సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుళ్లాయప్ప

అధ్యక్షుడిగా చిన్న పెద్దన్న, ప్రధాన కార్యదర్శిగా నాగభూషణ, ఆర్గనైజేషన్ కార్యదర్శిగా వెంకటప్పతో పాటు 15 మంది కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, మండల కార్యదర్శి వెంకటేష్, ఆదెప్ప, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలు

ధర్మవరం రూరల్: పోతుకుంట బృందావనకాలనీ వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..బృందావనకాలనీ వద్ద జయంత్ అనే బాలుడు రోడ్డు దాటుతుండగా మామిళ్లపల్లి వైపు నుంచి ధర్మవరం వెళుతున్న బైక్ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలుడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు.

పండ్లతోటల పరిశీలన



అరటితోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాస్త్రవేత్త, ఉద్యాన అధికారులు

తాడిమర్రి: దాడితోట గ్రామంలోని పండ్లతోటలను గురువారం ఉద్యానవన శాస్త్రవేత్తలు, అధికారులు పరిశీలించారు. గ్రామ సమీపంలో హైడ్రా పవర్ ప్రాజెక్టు నిర్మాణంతో వెలువడే దుమ్ముధూళితో అరటి, దానిమ్మ, టమాటా పంటలు దెబ్బతింటున్నాయని రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రేకులకుంట ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, మండల ఉద్యాన అధికారి అమరేశ్వరి పంటలను పరిశీలించారు.

కార్మికులకు పనిభారం తగ్గించాలి

ధర్మవరం అర్బన్: ధర్మవరం ఆర్టీసీ డిపోలో కార్మికులకు పనిభారం తగ్గించాలని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. పనిభారం పెంపునకు నిరసిస్తూ స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఈయూ నాయకులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఈయూ జిల్లా అధ్యక్షుడు కేబీ నాగార్జునరెడ్డి, డిపో కార్యదర్శి ముస్తఫా మాట్లాడుతూ ఆర్టీసీ డీఎం చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా ధర్మవరం డిపోలో ఓవర్ టైం డ్యూటీలు వేస్తున్నారన్నారు. ఒకవైపు యాజమాన్యం 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయకుండా 70, 71 సర్క్యులర్ పేరిట ఉద్యోగులను పనిష్‌మెంట్ల రూపంలో మానసికంగా వేధిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు కార్మికులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. యూనియన్ ఏడీసీలు మల్లికార్జున, టీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

ప్రశాంతి నిలయంలో దుర్గాష్టమి వేడుకలు

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో దసరా శరన్నవరాత్రులలో భాగంగా దుర్గాష్టమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం సత్యసాయి మహా సమాధి చెంత వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయుధ పూజలో భాగంగా సత్యసాయి బంగారు రథంతోపాటు వినియోగించిన వాహనాలకు పూజలు నిర్వహించారు. అలాగే సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ కార్యాలయాల్లోని ఆయా కార్యాలయాల సిబ్బంది ఆయుధ పూజ నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు, గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, పలువురు ట్రస్ట్ సభ్యులు, సిబ్బంది పూజల్లో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రశాంతి విద్వాన్ మహాసభలో భాగంగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి దసరా విశిష్టతను వివరించారు. భక్తులు సత్యసాయిని కీర్తిస్తూ భక్తిగీతాలు ఆలపించారు.



సత్యసాయి బంగారు రథానికి పూజలు నిర్వహిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు

నేడు మాజీ ఎమ్మెల్యే పర్యటన

అమడగూరు: మండలంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు అమడగూరులోని చౌడేశ్వరీ ఆలయంలో నవ చండీహోమంలో పాల్గొంటారన్నారు. ఉదయం 9 గంటలకు ఏ కొత్తపల్లి, 9.30కు కంచవాండ్లపల్లి, 10 గంటలకు పూలకుంటపల్లి, 10.30కు లోకోజుపల్లి, 11 గంటలకు కుమ్మరిండ్లు, 11.30 కందుకూరిపల్లి, 12 గంటలకు మహమ్మదాబాద్, 12.30 గొల్లపల్లి గ్రామాల్లో పర్యటిస్తారన్నారు.

నేడు నవ చండీహోమం

అమడగూరు: స్థానిక చౌడేశ్వరీ ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నవ చండీహోమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పొట్టా పురుషోత్తమరెడ్డి తెలిపారు.

కేసు నమోదు

కదిరి టౌన్: ప్రైవేటు స్థలంలో గుడిసెలు వేయించిన ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కదిరి గ్రామ రెవెన్యూ పొలంలో హిందూపురం-అనంతపురం బైపాస్ రోడ్డు వద్ద ఉన్న సర్వే నంబర్లు 1780-2,1778-2,1778-4,1778-9,1778-3లలో 3 ఎకరాల 81 సెంట్లు స్థలాన్ని కదిరికి చెందిన హర్షవర్ధన్, కృష్ణమూర్తి పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అయితే నాగన్న సదరు స్థలంలో అక్రమంగా గుడిసెలు వేయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆర్‌సీపీ నేత నాగన్నతో పాటు ఇలియాజ్, అరుణ్, సుగుణమ్మ, హబీబ్, శేఖర్, అల్తాఫ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ డీవీ నారాయణరెడ్డి తెలిపారు.

జాతీయ తపాలా వారోత్సవాలపై ర్యాలీ



గాండ్లపెంటలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

గాండ్లపెంట: జాతీయ తపాలా వారోత్సవాలపై గురువారం కదిరి డివిజన్ తపాలా ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్‌నాయక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తపాలా సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇండియా పోస్టల్ పేమెంట్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ గ్రూప్ పర్సనల్ యాక్సిడెంటల్ ప్లాన్‌ను వివరించారు. ఇందులో ఏడాదికి రూ.549 చెల్లిస్తే ప్రమాదం జరిగి వ్యక్తి మరణిస్తే రూ.10 లక్షల బీమా ఆ కుటుంబానికి అందుతుందన్నారు. పోస్టుమాస్టర్ నరసింహమూర్తి, సిబ్బంది బాబాఫకృద్దీన్, గిరిధర్, లక్ష్మేనాయక్,విశ్వనాథరెడ్డి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: మండల కేంద్రంలో గురువారం జాతీయ గ్రామీణ తపాలా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కదిరి సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్ నాయక్ మాట్లాడుతూ భారత తపాలా సంస్థ ఎన్నో పొదుపు పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. గ్రామీణ తపాలా జీవిత బీమా, చిన్న మొత్తాల పొదుపు, ఆడ పిల్లల కోసం సుకన్య సమృద్ధి యోజన, గాగ్ పాలసీ రూ. 549లకే రూ. 10 లక్షల బీమాను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం స్థానిక జాతీయ రహదారిపై ర్యాలీ చేపట్టారు. తనకల్లు సబ్ పోస్ట్ మాస్టర్ పీఎం జ్యోతీష్‌కుమార్, గ్రామీణ తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.

14 నుంచి పంచాయతీ వారోత్సవాలు

తనకల్లు: ఈ నెల 14 నుంచి పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పంచాయితీ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రెడ్డెప్ప గురువారం తెలిపారు. తొలిరోజు సీఆర్ పల్లి, ఈతోడు, డీటీ పల్లి, 15న కోటపల్లి, ముండ్లవారిపల్లి, మల్లిరెడ్డిపల్లి, 16న తవళం, జీఎస్ తండా, బొంతలపల్లి, 12న చీకటిమానిపల్లి, టీ. సదుం, తనకల్లు, 18న కొక్కంటి, డీసీపల్లి, రాచినేపల్లి, 19వ తేదిన కొర్తికోట, బాలసముద్రం గ్రామ సచివాలయాల్లో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మహేశ్వరమారుతి

గాండ్లపెంట: గర్భిణులు ఆరోగ్యసూత్రాలు పాటించాలని వైద్యాధికారి మహేశ్వరమారుతి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మహేశ్వరమారుతి గురువారం 45 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు చేశారు. ఇందులో 15 మందిని హైరిస్క్‌గా గుర్తించారు. ఈసందర్భంగా ఆయన గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

తాడిమర్రి: స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ కృష్ణమోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో వాచ్‌మెన్, స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఏడో తరగతి ఉత్తీర్ణత చెంది 18 ఏళ్ల నిండిన యువతులు ఈనెల 15లోపు ఎమ్మార్సీలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

దుర్గామాతా నమోస్తుతే!

సాక్షి నెట్‌వర్క్: శరన్నవరాత్రి ఉత్సవాలు ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లో సందడిగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం వివిధ ఆలయాల్లో అమ్మవార్లను అర్చకులు పలు రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



బత్తలపల్లి: దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



బత్తలపల్లి: దుర్గామాతగా లలిత త్రిపుర సుందరీదేవి



తనకల్లులో శాకాంబరి అలంకరణలో చౌడేశ్వరి



ధర్మవరం అర్బన్: లక్ష్మీధన్వంతరిగా శ్రీనివాసనగర్ వేంకటేశ్వరస్వామి



తాడిమర్రి : దుర్గామాత రూపంలో దర్శనమిస్తున్న వాసవీమాత



ధర్మవరం అర్బన్: దుర్గాదేవిగా గాంధీనగర్ చౌడేశ్వరిదేవి



కదిరి అర్బన్: మహిషాసురమర్దినిగా కుమ్మరవాండ్లపల్లి మల్లాలమ్మ



పుట్టపర్తిలో దుర్గాదేవిగా సత్తెమ్మ దేవత



తలుపుల మండలం పి.కొత్తపల్లిలో మహిషాసురమర్దినిగా వాసవీమాత



కదిరి టౌన్: దుర్గాదేవి అలంకారంలో మహాలక్ష్మి

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం సురక్షితం

చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం సురక్షితమని మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ తెలిపారు. గురువారం ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం చేయించుకోవాలని పేర్కొన్నారు. భోజనంలో ఆకుకూరలు, కూరగాయలు ఉండేలా చూసుకోవాలన్నారు. అనారోగ్యానికి గురైతే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. అవసరమైతే సమీపంలోని ఏఎన్ఎం, ఆశాలకు సమాచారం అందించాలన్నారు. అనంతరం వారికి పౌష్టికాహారాన్ని అందించారు.



గర్భిణులకు భోజనం అందిస్తున్న డాక్టర్ రవినాయక్